క్లుప్తంగా

మహాగర్జనను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన విశాఖపట్నంలో జరిగే మహాగర్జనకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మహాగర్జనకు మద్దతుగా ఈ నెల 23, 24 తేదీల్లో ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట, 25న కలెక్టరేట్ ఎదుట నిరసనలు తెలుపనున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో జరిగే మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు చోట్ల శుక్రవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి చౌరాస్తా ప్రాంతంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపడుతున్న కారణంగా స్తంభాలు, వైర్లు సర్దుబాటు చేస్తున్నామన్నారు. దీంతో బాబా బృందావన్ నగర్, నిర్మల నగర్, గురు రాఘవేంద్ర నగర్, నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

23న వాసవీమాత ఆత్మార్పణోత్సవం

కర్నూలు కల్చరల్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఓల్డ్‌సిటీ పూలబజార్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చిన్న అమ్మవారి శాల ప్రధాన కార్యదర్శి చిలుకూరు నందకిషోర్ తెలిపారు. అమ్మవారు ఆత్మార్పణ గావించి 1022 సంవత్సరాలు అవుతుందని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి అభిషేకం, కుంకుమార్చన, అన్నదానం, సాయంత్రం 6 గంటలకు జ్యోతి ఉత్సవం కన్యకలచే అమ్మవారికి పూజ సామూహిక హారతుల కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(సెంట్రల్): కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ సి.గురుశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు- వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికే ఖర్చు చేయాలని- సామాజిక రక్షణ సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఈ రౌండ్ టేబుల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున ఈ కార్యక్రమానికి చేతివృత్తిదారుల సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు బీజేపీ ఆందోళన

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి పేర్కొన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బీజేపీ నేతలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, సంచార జాతుల బీజేపీ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

31న కర్నూలు జిల్లాకు ఎన్‌ఎల్‌ఎం టీమ్ రాక

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగాన్ని పరిశీలించేందుకు నేషనల్ లెవల్ మానిటరింగ్(ఎన్‌ఎల్‌ఎం)కమిటీ కర్నూ లు జిల్లాకు ఈ నెల 31న రానుంది. కమిటీ సభ్యు లు జిల్లాలోని అన్ని మండలాల్లో తొమ్మిది రోజుల పాటు పర్యటించనున్నారు. కమిటీలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇద్దరు అధికారులు ఉంటారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని బాలాజీ నగర్ మున్సిపల్ పార్కు, మాధవీ నగర్ వాటర్ ట్యాంకు వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని మున్సిపల్ ఎస్‌ఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్ నాయుడులను ఆదేశించారు. అలాగే కాలనీలలో సమస్యలను పరిశీలించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, తెగింపు, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: ధమాకా, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు. తెగింపు, కళ్యాణం కమనీయం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు
ఐనాక్స్: అవతార్ ది వే ఆఫ్ వాటర్, ఎమ్‌త్రీగన్, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
భరత్ కాంప్లెక్స్: తెగింపు
రాజ్: వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య
విజయ: వాల్తేరు వీరయ్య



కేబుల్.. ట్రబుల్

కర్నూలు నగరం కేబుల్ తీగల్లో చిక్కుకుంది. నగరంలోని ప్రధాన రహదారుల్లోని విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లకు మున్సిపల్ అధికారులు కేబుల్ కనెక్షన్లు తొలగించారు. దీంతో కొండారెడ్డి బురుజు నుంచి కొత్తబస్టాండ్ వరకు చెల్లాచెదురుగా రోడ్లపై కేబుళ్లు పడి ఉండటంతో వాహనాలు, ఆటోలకు చుట్టుకుంటూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఒక ఆటోకు మొత్తం వైర్లు చుట్టుకుని బోల్తా పడగా లేపి వైర్లను తొలగించుకున్నాడు డ్రైవర్. నగరంలోని ఏ స్తంభాన్ని చూసినా వైర్లతో చుట్టుకుపోయిన దృశ్యాలే కన్పిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు







జగనన్న దయతో ఇంగ్లిష్ చదువు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో మహిళ సుహాసిని
- తెలుగు గేరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు(రాజ్‌విహార్): 'నేను, నా భర్త రోజు వారి కూలీ పనులకు పోతాం. పిల్లలను ఇంగ్లిష్ చదువు చెప్పించేందుకు మా కూలీ సాలదు. వాళ్లేమో ఇంగ్లిష్ బడికి పోతాం అంటారు. జగనన్న సీఎం ఐనాక ఆ యదారు లేదు. మున్సిపాల్టీ బడుల్లో కూడా ఇంగ్లిషు చెబుతున్నారు. మా అన్న దయతో నా పిల్లలు కూడా ఇంగ్లిష్ చదువు నేర్చుకుంటున్నారు. పిల్లలను చదివిస్తున్నందుకు ఏడాదికి రూ.14వేలు అమ్మ ఒడి కింద నా బ్యాంకులో వేస్తున్నారు. శానా సంతోషమన్న అంటూ తెలుగు గేరి ప్రాంతానికి చెందిన సుహాసిని ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్‌తో చెప్పుకుంది. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే 10వ వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెలుగుగేరి, గౌండ గల్లీ, చేపల ఖలీల్ వాడ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందించారు. వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకొని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల విద్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు తేవడంతో పాటు నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యూనుస్ బాషా, నాయకులు డాక్టర్ రేహాన్ అలీఖాన్, పర్వేజ్, నజీర్, నూరుల్లాఖాద్రీ, సోహెల్, షబ్బీర్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 36వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్గాలకు, పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని వాసవీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని వార్డులోని ప్రతి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశామని చెప్పారు. కరోనా పరిస్థితులు ఉన్నపటికి రాష్ట్రంలో పేదలు ఇబ్బందులు పడకుదని సంక్షేమ పథకాలను అందించమని చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం అందిస్తున్న పాలనకు తేడాను గమనించాలన్నారు. అవినీతి రహితంగా పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయ్యే ఎన్నికల్లో ఆశ్వీరదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, వైజా అరుణ, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మి కాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వార్డు ఇన్‌చార్జ్‌లు శ్రీధర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, నాయకులు పెద్దయ్య, పుల్లారెడ్డి, వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారికి మెమో

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని కొత్తపేట రైతు బజారు ఎస్టేటు అధికారి జయమ్మకు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి మెమో జారీ చేశారు. ఈ నెల 18వ తేదీ కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారి అక్రమాలపై 'ముడుపులు ఇవ్వకుంటే వేధింపులే' శీర్షికతో ప్రచురితమైన వార్తకు మార్కెటింగ్ శాఖ ఏడీ స్పందించారు. మెమో జారీ చేస్తూ ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కాగా ఏడీ గురువారం కొత్తపేట రైతుబజారుకు వెళ్లి కూరగాయలు, ఆలు, ఆకుకూరలు అమ్మే వారితో విచారణ జరిపారు. అయితే ఎస్టేటు ఆఫీసరు సమక్షంతో ముడుపులపై ఆరా తీయడం వల్ల చెప్పలేకపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై ఏడీ స్పందిస్తూ కొత్తపేట రైతుబజారుపై ప్రత్యేక నిఘా పెడుతామని తెలిపారు. మెమోకు వివరణ ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామన్నారు.

గుండె ఆరోగ్యాన్ని కనిపెడుతూ ఉండాలి



కేక్ కట్ చే సి మాట్లాడుతున్న డాక్టర్ చైతన్యకుమార్

కర్నూలు(హాస్పిటల్): గుండె ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండాలని మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్టులు డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ తేజా నందన్‌రెడ్డి, డాక్టర్ బీఎస్. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మెడికవర్ హాస్పిటల్‌లో తక్కువ సమయంలో 15వేల గుండె ప్రొసీజర్స్ పూర్తయిన సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హార్ట్ ఎటాక్, హార్ట్ ఫెయిల్యూర్ వంటి ప్రాణాంతక సమస్యలు వచ్చే ముందు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఏ కారణం లేకుండా ఒళ్లంతా చెమటలు పట్టడం, తల తిరగడం, ఛాతిలో మంట, వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి పాల్గొన్నారు.

యూకాన్ ప్లాజాలో అక్రమ షాపుల తొలగింపు

కర్నూలు (టౌన్): యూకాన్ ప్లాజాలో వెలసిన అక్రమ షాపులను ఎట్టకేలకు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు గురువారం తొలగించారు. ఈ కాంప్లెక్స్‌లో ఉన్న షాపులు కాకుండా అక్రమంగా మరో 14 షాపులు వెలిశాయి. వీటిని తొలగించాలని యూకాన్ ప్లాజాలోని వ్యాపారులు నగరపాలక అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందనలో లిఖిత పూర్వకంగా వినతిపత్రాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించడంతో వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా కదలకపోవడంతో రెండు రోజుల క్రితం యూకాన్ ప్లాజా షాపుదారులు నగరపాలక సంస్థ ఎదుట ఆందోళన చేశారు. దీంతో ఎట్టకేలకు టౌన్‌ప్లానింగ్ సీటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, టీపీఎస్ శబరీష్, సిబ్బందితో పాటు పోలీసుల సహాయంతో 14 షాపులను తొలగించారు. కొంత అడ్డుకునే ప్రయత్నం చేసినా పోలీసుల సహకారంతో వాటిని తొలగించారు.

రేపు 'దిశ' కమిటీ సమావేశం

- కేంద్ర ప్రభుత్వం నిధుల వినియోగంపై సమీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం ఈ నెల 21న జరుగనుంది. ఈ కమిటీకి కర్నూలు ఎంపీ ఎస్.సంజీవ్‌కుమార్ చైర్మన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహిస్తారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ, డీఆర్‌డీఏ-వైకేపీ, వ్యవసాయ శాఖ, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అటవీ శాఖ తదితర శాఖలకు కేంద్రం నుంచి వివిధ స్కీమ్‌ల కింద నిధులు విడుదల అవుతున్నాయి. ఈ నిధుల వినియోగంపై దిశ కమిటీ కో-ఆర్డినేషన్ చేయడంతో పాటు పర్యవేక్షిస్తుంది. శనివారం జరిగే దిశ కమిటీ సమావేశానికి నంద్యాల ఎంపీతో కర్నూలు,నంద్యాల జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు కూడ హాజరవుతారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు.

ఆక్సిజన్ పంపిణీలో ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణం నేపథ్యంలో ఆక్సిజన్ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలించే సమయంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాధిపతులు, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని పలు విభాగాలకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ రీ డిస్ట్రిబ్యూషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆక్సిజన్ స్విచ్ ఓవర్ కోసం ఏపీఎంఎస్ఐడీసీ చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి ఆయన వివరించారు. ఆసుపత్రిలోని ఆక్సిజన్ షిఫ్టింగ్ చేసే సమయంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, హెచ్‌వోడీలు డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ విశాల, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాలాజినాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని తిరుచ్చిలో నిర్వహిస్తున్న 44వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు శేఖర్, షేక్షావలి, సంపత్‌కుమార్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను తన కార్యాలయంలో ఒలంపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోను రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

6న పోరుబాట

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మించే ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుక, కంకర, సిమెంట్ చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి చెల్లిస్తున్న రూ.1.80 లక్షలు ఏమి సరిపోవడంలేదన్నారు. ఈ క్రమంలో ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. వెంటనే పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పజెప్పాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులకు డబ్బులు పెంచాలని కోరుతూ ఫిబ్రవరి 6న కలెక్టరేట్ ఎదుట పోరుబాటను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, జగన్నాథం పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి



వేమన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ వేణుగోపాల్ తదితరులు

కర్నూలు సిటీ: ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలు గురువారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఎ.సత్యనారాయణ వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డా.వింధ్యవాసిని దేవి, కాలేజీ కో ఆర్డినేటర్ జె.హేమంత్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బిక్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్ వేమన చిత్ర పటానికి నివాళులర్పించి ప్రసంగించారు. యోగి వేమన మొట్ట మొదటి సంఘ సంస్కర్త అని, ఆయన పద్యాలన్నీ కూడా ఆటవెలదిలోనే ఉంటాయన్నారు. అందరికి సులువుగా పద్యాలు అర్థమయ్యే రీతిలో ఉంటాయని, అందులోని సారాంశం మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తాయన్నారు. వేమన పద్యాలను ఆలపించిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆ స్కూల్ హెచ్‌ఎం సీ.ఎస్ లక్ష్మీనారాయణ, ప్రజా చైతన్య అధికారి సి.రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కరెంటు తీగలకు టిప్పర్ ఢీకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆసుపత్రిలో కొత్త భవనాల నిర్మాణంలో భాగంగా తీస్తున్న పునాదుల్లోని మట్టిని టిప్పర్‌లో వేసుకుని నూతనంగా నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద గుంతలను పూడుస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఓ టిప్పర్‌లో మట్టి వేసుకుని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద మట్టి వేసి ముందుకు వస్తుండగా వాహనం విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో లెప్రసీ వార్డు, మానసిక రోగుల వార్డు, పలు వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. వెంటనే స్పందించిన అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు.

21న కర్నూలుకు నాగబాబు

కర్నూలు(టౌన్): జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదేల నాగబాబు ఈ నెల 21న కర్నూలుకు రానున్నారు. శనివారం ఉదయం ఆ పార్టీ వీర మహిళలు ఏర్పాటు చేయనున్న సభలో, మధ్యాహ్నం జన సైనికులు ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొంటారు.

జిల్లా కళాకారునికి అవార్డు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరానికి చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు, హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి ఉత్తమ కళా సేవ అవార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, శ్రీరాగ రమ్య కల్చరల్ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం జరిగిన కళా హేమంతం 4వ వార్షికోత్సవ వేడుకల్లో అవార్డులను ప్రదానం చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(లీగల్): విశ్వ ఆయుర్వేద పరిషత్, ఆయుష్ విభాగాల సహకారంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డిలు తెలిపారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ సి.లక్ష్మణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. వైద్యనిపుణులు డాక్టర్ డి.ఎ.పద్మనాభరెడ్డి, డాక్టర్ మాధవరావు చౌదరి, డాక్టర్ వి.కె.ఎం.లావణ్యలు వైద్యసేవలు అందిస్తారని, కావున న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది తదితరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు సూచించారు.

అభ్యర్థులు శారీరక ధృడంగా ఉండాలి

కర్నూలు సిటీ: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలంటే అభ్యర్థులు శారీరక, మానసికంగా చాలా ధృడంగా ఉండాలని మూడవ పట్టణ సీఐ తబ్రేజ్ అన్నారు. గురువారం పోలీసు కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు ఏఐఎఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో నమూనా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను నగరంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సీఐ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి నమూనా పరీక్షలకు హాజరైతే ఎక్కడ తమలో ఇంకా లోపం ఉందో తెలుసుకొని సరి చేసుకునేందుకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి తదితరులు పాల్గొన్నారు.

మెట్లపై నుంచి పడి మహిళ మృతి

కర్నూలు(టౌన్): మెట్లపై నుంచి జారిపడటంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. స్థానిక బుధవారపేటకు చెందిన ప్రభావతి(45) గృహిణి, భర్త వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. గురువారం ఉదయం ఆమె ఇంటిపై నుంచి మెట్లు దిగుతూ జారి పడింది. అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె మృతిచెందినట్లు మూడవ పట్టణ పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో జైలు, జరిమానా

కర్నూలు(లీగల్): కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన పఠాన్ ఇమ్రాన్ ఖాన్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి.కేశవ్ గురువారం తీర్పు చెప్పారు. 2020 సెప్టెంబర్ 6వ తేదీన మహ్మద్ రఫి అనే వ్యక్తిపై నిందితుడు పఠాన్ ఇమ్రాన్ ఖాన్ దాడి చేసి హత్యాయత్నం చేశాడని ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు వాదించారు. జరిమానాలో రూ.10 వేలు ఫిర్యాదుదారుడు, సహబాధితుడికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

29 నుంచి మహిళల జూడో పోటీలు

కర్నూలు(టౌన్): ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సౌత్ జోన్ స్థాయి మహిళల జూడో పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పన్ను వసూళ్ల కేంద్రాలకు ప్రత్యేక సిబ్బంది నియామకం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పన్ను వసూళ్ల కేంద్రాలు సెలవు దినాల్లోనూ పనిచేసే విధంగా నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ చర్యలు తీసుకున్నారు. రెండవ శనివారం, ఆదివారాలు, పండుగ సెలవుల్లోనూ పన్నులు చెల్లించే పన్నుదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నగరపాలక ఉద్యోగులను కేటాయిస్తు గురువారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. యు.విజయుడు, టి. రమేష్‌బాబు, ఎస్.మల్లికార్జునలు సెలవుదినాల్లో పన్ను కౌంటర్లలో పనిచేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మార్చి నెలాఖరుకు ఆస్తి, నీటి పన్నులు చెల్లించే ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

నేటి నుంచి భక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రామకృష్ణ – వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు కర్నూలులో రాష్ట్ర ఐదవ భక్తి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.జి. శరత్ చంద్రబాబు, కన్వీనర్ డాక్టర్ పి.పి.వి.డి. నాగత్రిశూలపాణి పేర్కొన్నారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 20, 21, 22 తేదీల్లో ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సంస్థాగత సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మొదటి రోజు కళాశాలల విద్యార్థులచే యువజన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు 2000 మంది సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. రామకృష్ణ మిషన్ కడప కార్యదర్శి స్వామి భీతిహరానంద మహారాజ్, స్వామి సన్నివాసానంద, రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి, రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఆర్‌వీబీపీపీ) రాయలసీమ అధ్యక్షుడు స్వామి సుకృతానంద మహరాజ్ తదితరులు పాల్గొని సందేశమిస్తారని తెలిపారు.